సాక్షి సిద్దిపేట

మంగళవారం । 27 । ఆగస్టు । 2024

గోవిందా గోపాల



కొమురవెల్లి(సిద్దిపేట): పెద్దపట్నం వేస్తున్న ఆలయ అర్చకులు



కొమురవెల్లి: స్వామి వారి ఊరేగింపు



చేర్యాలలో..

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో కృష్ణాష్టమి ఘనంగా నిర్వహించారు. సోమవారం స్వామి వారికి ఒగ్గపూజారులు ఆలయ సంప్రదాయం ప్రకారం పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఒగ్గుపూజారులు.. కృష్ణ, గొల్లభామల వేషధారణతో గంగరేణు చెట్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉట్టిని కొట్టి సంబురాలు జరుపుకొన్నారు. ఆలయ అర్చకులు, అధికారులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో పుర వీధులలో ఊరేగించారు. అనంతరం జానపదుల సంప్రదాయం ప్రకారం గంగిరేణు చెట్టు ప్రాంగణంలో స్వామి వారికి పంచవన్నెల రంగులతో 41 వరుసలతో పెద్ద పట్నం ఏర్పాటు చేశారు. ఉత్సవ విగ్రహాలను ఆలయ అర్చకులు పట్నంమీదికి తీసుకురాగా కల్యాణం జరిపించారు. దీంతో భక్తులు, శివసత్తులు తన్మయత్వానికి గురయ్యారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బాలాజీ శర్మ, ఏఈఓ బుద్ది శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోండి

విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రమోహన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ వినియోగదారుల సమస్యలపై మంగళవారం జిల్లా విద్యుత్ భవన్‌లో నిర్వహించనున్న గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రమోహన్ సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్‌లో మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సీజీఆర్ఎఫ్ (కన్జ్యూమర్ గ్రీవెన్సెస్ రీడ్రెసెల్ ఫోరం) ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే నిర్వహించనునట్లు తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి హాజరయ్యే వినియోగదారులు విద్యుత్ బిల్లు రసీదు, ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు



సుజాత, ప్రిన్సిపాల్, దుబ్బాక

దుబ్బాకటౌన్: సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల దుబ్బాకలో ఇంటర్ మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత సోమవారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో 20 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈనెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆసక్తి కలిగిన బాలురు ఒరిజినల్ ధ్రువ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాల్సిందే

సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అశోక్

చేర్యాల(సిద్దిపేట): మండలపరిధిలోని నాగపురి గ్రామ రెవెన్యూ శివారు కొండపోచమ్మ చెరువు శిఖంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, నాగపురి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 831లో కొండపోచమ్మ చెరువు 22.02 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. దీనికి వందలాది ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. కొండపోచమ్మ చెరువు శిఖంలో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేశారని ఆరోపించారు. ఈ విషయమై గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు, అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. చెరువు రక్షణ కోసం వెళ్లిన గ్రామస్తులపై కబ్జాదారులు కేసులు పెట్టించారని మండిపడ్డారు. హైడ్రా తరహాలో అక్రమ నిర్మాణాలను తొలగించి చెరువు శిఖం భూమిని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

గంజాయి, డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు


సీఐ మహేందర్‌రెడ్డి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ దామోదర్

మర్కుక్(గజ్వేల్): యువత గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని, గ్రామాల్లో అపరిచితుల పట్ల జాగ్రత్తలు పాటించాలని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శివారు వెంకటాపూర్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో దాతలు, గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ మోసాలు, అపరిచిత ఫోన్‌కాల్స్, మెసేజ్, ఆన్‌లైన్ లోన్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలనారు. తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలను ఇవ్వవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ దామోదర్ తదితరులున్నారు.

సింగూరుకు వరద



పుల్‌కల్(అందోల్) : సింగూరు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. డ్యాం పరిసర ప్రాంతాలలో వానలు కురుస్తుండటంతో వరద చేరుతుంది. వారం రోజుల్లో డ్యాంలోకి ఒక టీఎంసీ నీరు చేరింది.ప్రాజెక్టు నీటి నిల్వ 29.917టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.646 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు వెల్లడించారు. డ్యాం నుంచి ప్రతీరోజు మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, జంట నగరాల తాగునీటికి 80క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

రిజర్వాయర్‌లోకి పంపింగ్



రిజర్వాయర్‌లోకి పంపింగ్ అవుతున్న నీరు

మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లోకి నాలుగు పంపుల ద్వారా మొత్తం 5200 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేసినట్లు అధికారులు సోమవారం తెలిపారు. సెప్టెంబర్ ఒకటి వరకు ఈ ప్రక్రియ కొనసాగించడానికి ప్రతిపాదించినట్లు అధికారులు వెల్లడించారు.

– తొగుట(దుబ్బాక)

ఫీవర్ .. ఫియర్

- జిల్లాలో ఇప్పటివరకు 56 డెంగీ, 19 టైఫాయిడ్ కేసులు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల కిటకిట
- ప్రారంభమైన ఇంటింటి ఫీవర్ సర్వే
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యాధికారులు

జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో జ్వర బాధితుల సంఖ్య పెరుగుతోంది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రులే కాకుండా, ప్రైవేటు ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి. సిద్దిపేట జిల్లాలో డెంగీ, మలేరియా కేసులతో పాటు వైరల్ ఫీవర్ బారిన పడి ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న వారి సంఖ్య ఎక్కువ ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆ మేరకు చుట్టుపక్కల ప్రాంతాలు, మన ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా పెట్టుకోవాలని పలువురు వైద్య నిపుణులు చెబుతున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి వైరల్ ఫీవర్ సర్వే ప్రారంభించింది.



సిద్దిపేట ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న జ్వర బాధితులు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జులై నెలలో పలు విభాగాల్లో ఓపీ విభాగంలో 31,060 మంది వైద్య సేవలు పొందారు. వీరిలో 2,306 మంది ఆస్పత్రిలో ఇన్ పెషేంట్ విభాగంలో ఆస్పత్రిలో అడ్మిట్ అయి వైద్యచికిత్స పొందారు. ఈనెలలో ఇప్పటి వరకు సుమారు 30వేల మందికి పైగా పలు విభాగాల్లో ఓపీ సేవలు పొందారు. అలాగే ప్రభుత్వాస్పత్రిలో రోజూ సుమారు 1200 నుంచి 1400, 1500 మంది ఓపీ విభాగంలో వైద్యులను సంప్రదిస్తుండడంతో వీరిలో ఎక్కువ మొత్తంలో విష జ్వరాల బారిన పడిన వారే అధికంగా ఉన్నారు.

చాప కింద నీరులా డెంగీ

జిల్లాలో డెంగీ కేసులు చాప కింద నీరులా విస్తరిస్తున్నాయి. జిల్లాలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 56 డెంగీ కేసులు, 19 టైఫాయిడ్ కేసులు, మలేరియా ఒకటి, వైరల్ ఫీవర్స్ 290 కేసులు నమోదైనట్లు వైద్యారోగ్యశాఖ నివేదికలు వెల్లడిస్తున్నాయి. వైరల్ ఫీవర్ బారిన పడి ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన, పొందుతున్న వారు మరొకొంత మంది ఉన్నారు. ఎలిసా టెస్టు ద్వారా డెంగీని నిర్ధారణ చేయాలని వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నా ప్రైవేటు ఆస్పత్రుల వారు అనధికారికంగా నిర్వహిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

ప్రారంభమైన ఫీవర్ సర్వే

కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఆదివారం ఇంటింటి ఫీవర్ సర్వే ప్రారంభమైంది. ఈనెల 30 వరకు సర్వే కొనసాగనుంది. వైద్య సిబ్బంది, ఆశలు ప్రతీ ఇంటికి వెళ్లి ఎవరికైనా జ్వరం వంటి లక్షణాలతో ఉంటే పీహెచ్‌సీలకు పంపనున్నారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ పరీక్షించి మందులు అందజేయడం, అవసరమైన వారిని ప్రభుత్వ ఆస్పత్రులకు రిఫర్ చేసి చికిత్స అందించనున్నారు.

ప్రభుత్వాస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలి



ప్రస్తుత సీజన్‌లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మా వద్దకు వచ్చే వన్నీ జ్వరాలు, కేసులు డెంగీ కేసులు కాదు. ఎలిసా టెస్టు ద్వారానే డెంగీగా నిర్ధారణ చేయొచ్చు. జ్వరం బారిన పడిన వారు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోకూడదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని సదుపాయాలున్నాయి. ప్రభుత్వాస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలి. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. వేడిగా తాజా ఆహారం తీసుకోవాలి. రోడ్డు పక్కన దొరికే ఆహార పదార్థాల జోలికి వెళ్లకపోవడం మంచిది.

– డాక్టర్ శ్రీనివాస్, ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ, సిద్దిపేట

కృత్తిక వైభవం.. వ్రత శోభితం



కృత్తిక నక్షత్రవేళ వర్గల్ సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్యమంగళ రూపం

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన వర్గల్ శ్రీవిద్యాధరి, నాచగిరి శ్రీలక్ష్మీనృసింహక్షేత్రాలు శ్రావణ సోమవారం సందర్భంగా విశేష పూజలతో అలరారాయి. విద్యాసరస్వతి క్షేత్రంలోని సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో స్వామివారి జన్మనక్షత్రం పురస్కరించుకుని కృత్తిక మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి పర్యవేక్షణలో అర్చకులు మూలవిరాట్టుకు విశేష అభిషేకం జరిపారు. సుబ్రహ్మణ్య నామాలు పఠిస్తూ సామూహిక లక్ష పుష్పార్చన చేశారు. భక్తజనులు వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని, ప్రధాన ఆలయంలో శ్రీవిద్యాసరస్వతి అమ్మవారిని, ఉప ఆలయాల్లో దేవతామూర్తులను దర్శించుకుని తరించారు.

వ్రత నాచగిరి

నాచగిరి శ్రీలక్ష్మీనృసింహుని సన్నిధి సామూహిక వ్రతాలు, అభిషేకాలు, కల్యాణాలతో అలరారింది. సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలొచ్చారు. మొక్కులు తీర్చుకుని స్వామిని దర్శించుకుని తరించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



నాచగిరిలో వ్రతమాచరిస్తున్న దంపతులు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ మధు

ప్రజల భద్రత కోసమే తనిఖీలు

- 28 ద్విచక్ర వాహనాలు, కారు, ఆటో సీజ్
- ఏసీపీ మధు

సిద్దిపేటకమాన్: ప్రజల రక్షణ, ప్రజలకు సెన్సాఫ్ సెక్యూరిటీ భద్రతా భావం కలిగించడం కోసం తనిఖీలు నిర్వహించామని సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఆయన ఆధ్వర్యంలో సిద్దిపేట ఇందిరమ్మ కాలనీ, కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం ఇళ్లలో సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీపీ ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించామన్నారు. తనిఖీల్లో ఇందిరమ్మ కాలనీలో ఎలాంటి పేపర్లు లేని 11 ద్విచక్ర వాహనాలు, కేసీఆర్ నగర్‌లో ఎలాంటి పేపర్లు లేని 17 ద్విచక్ర వాహనాలు, కారు, ఆటో సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే రూ.5వేల విలువగల గుట్కా ప్యాకెట్లు, బెల్ట్ షాప్‌పై రైడ్ చేసి రూ.4వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నార్కోటిక్ డాగ్స్ ద్వారా అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్తులు వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయాలు కూడా ఈ కార్యక్రమం ద్వారా తెలుస్తుందన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు నరసింహారావు, కనకయ్య, ఆసిఫ్, అపూర్వరెడ్డి, రాజేశ్, హరీశ్, పరుశురామ్, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

గజ్వేల్‌రూరల్: వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని సిద్దిపేట ఏసీపీ పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని తూప్రాన్, ఐవోసీ చౌరస్తా, ప్రజ్ఞాపూర్‌లోని ఏసీపీ కార్యాలయం ఎదుట గజ్వేల్ సీఐ సైదాతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. దీంతో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై 42 కేసులు, డ్రంకెన్ డ్రైవ్ చేసిన ముగ్గురిపై కేసులు నమోదు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాను నివారించేందుకు తరచుగా ఆకస్మిక తనిఖీలను నిర్వహిస్తున్నామన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గజ్వేల్ అదనపు సీఐ ముత్యం రాజు, ఎస్ఐలు శంకర్, కరుణాకర్‌రెడ్డి, విజయ్ కుమార్, దామోదర్, చంద్రమోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిద్రావస్థలో నిఘా నేత్రం!



గుబ్బడిలో పని చేయని సీసీ కెమెరా

మూడో నేత్రమైన సీసీ కెమెరాలు నిద్రావస్థలో ఉన్నాయి. మొదట్లో సవ్యంగా పని చేశాయి. రానురానూ మరమ్మతులకు గురయ్యాయి. ఇందులో ఏవి సరిగా పనిచేస్తున్నాయో.. చేయడం లేదో తెలియని పరిస్థితి నెలకొంది. నిధుల కేటాయింపు లేకపోవడం కూడా నిర్వహణకు భారంగా మారింది. గ్రామాల్లో ఏదైనా అనుకోని ఘటనలు, చోరీలు జరిగితే తమ పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దాతలు సహాయ సహకారాలను తీసుకొని అయినా రిపేర్లు చేయించాలని పోలీసులను కోరుతున్నారు.

- మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలు 102
- కొరవడిన నిర్వహణ, పర్యవేక్షణ
- వేధిస్తున్న నిధుల సమస్య
- పట్టించుకోని అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలో మొత్తం 32 గ్రామాలున్నాయి. పోలీసుల ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజాప్రతినిధుల, దాతలు, వ్యాపారులు ఇతర సంస్థల సహకారంతో సుమారుగా 163 పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క గ్రామంలో 6 నుంచి 8 వరకు వీటిని ఏర్పాటు చేశారు. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించినా అంతే స్థాయిలో నిర్వహణ లేక పోయింది. మొదట్లో బాగానే పనిచేసినా నిర్వహణ, మరమ్మతులు సమస్యగా మారింది. వాటి పనితీరును పర్యవేక్షణ, పరిశీలించేందుకు ప్రత్యేక సిబ్బందిని గానీ, నిధులను గానీ కేటాయించలేదు. దీంతో ఉన్న సీసీ కెమెరాల్లో ఏవీ సరిగ్గా పనిచేస్తున్నాయో లేవో అవికూడా తెలియని పరిస్థితి నెలకొంది.

సుమారుగా 2, 3 నెలల కిందట వంకాయతండాకు చెందిన వ్యక్తి బైక్‌పై తండా నుంచి చాపగానీతండా గ్రామానికి వెళ్లే మార్గమధ్యలో రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. ఘటన స్థలంలో పరిశీలిస్తే వాహనం ఢీకొన్నట్లు గ్రామస్తులు, వాహనదారులు ఆరోపించారు. కానీ కట్కూర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో పోలీసులు గుర్తించలేకపోయారు. రామవరంలోనూ అంతే.. ఓ కిరాణా షాప్ ఇంటి ఎదుట ఉంచిన కారు అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయగా సదరు కిరాణషాప్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇక్కడ ఏర్పాటు చేసిన సీసీని పరిశీలిస్తే పని చేయడం లేదని తమకేమీ పట్టనట్లు వదిలేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సీసీ కెమెరాల మరమ్మతులకు నిధులను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

రిపేర్లు ఉన్నాయి



ఎవరి ఇంటి ఎదుట వారు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. గతంలో దాతలు, ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రస్తుతం రిపేర్‌లో ఉన్నాయి. వాటిని మరమ్మతులు చేయించాలంటే నిధులు అవసరం. దీంతో గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తూ రిపేర్లల్లో ఉన్నా సీసీ కెమెరాలను మరమ్మతులు చేయించాలని అవగాహన కల్పిస్తున్నాం.

–విజయ్‌భాస్కర్, ఎస్ఐ, అక్కన్నపేట మండలం

వీధికుక్కలకు స్టెరిలైజేషన్ ఆపరేషన్లు



కార్యక్రమాన్ని ప్రారంభించిన రజిత

హుస్నాబాద్‌రూరల్: పట్టణంలో వీధికుక్కలను అరికట్టేందుకు స్టెరిలైజేషన్ ఆపరేషన్లు చేయిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని వీధి కుక్కలను పట్టి సిద్దిపేటలోని ఏబీసీ (మానిమల్ బర్త్ కంట్రోల్)కు సోమవారం తరలించినట్లు ఆమె చెప్పారు. జంతు సంక్షేమ సంస్థతో ఒప్పందం చేసుకొని పట్టణంలోని వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేయిస్తున్నామని తెలిపారు. పట్టుకున్న కుక్కలను సిద్దిపేట తీసుకెళ్లి స్టెరిలైజేషన్ చేసిన నాలుగు రోజులకు అదే ప్రాంతంలో వదిలివేస్తామని చెప్పారు. ఇటీవల కుక్కల దాడుల్లో చిన్నారులు, పెద్దలు గాయపడిన ఘటనలు చూసి ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు కార్యక్రమం చేపట్టినట్లు చైర్‌పర్సన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లుకున్న చీకటి



వీధి లైటుకు అల్లుకున్న పొదలు

బెజ్జంకిలోని లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం, ఏఎంసీ మార్కెట్ చౌరస్తాలోగల ఓ వీధిలైట్ వెలుగుతున్నా చీకట్లు మాత్రం వీడడంలేదు. అందుకు కారణం తీగలు, పొదలు అల్లుకుపోవడమే. అయినా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే వారపు సంతకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పొదలను తొలగించాలని కోరుతున్నారు.

– బెజ్జంకి(సిద్దిపేట)

బతుకు బండి.. భలేగుంది

రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు వాళ్లవి.. వృద్ధాప్యంలోను ఆ ఇద్దరు దంపతులు ద్విచక్రవాహనంపై తిరుగుతూ ప్లాస్టిక్ వస్తువులు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సిద్దిపేటకు చెందిన వారు మిట్టపల్లి సమీపంలో తమ బండిపై వెళ్తుండగా సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



క్లుప్తంగా

సీసీఆర్టీ వర్క్‌షాపునకు రాజమల్లు ఎంపిక


రాజమల్లు

హుస్నాబాద్‌రూరల్: కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో నిర్వహించి వర్క్‌షాపునకు హుస్నాబాద్ ఆంగ్ల ఉపాధ్యాయుడు పంజా రాజమల్లు ఎంపికయ్యారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 5 వరకు గౌహతిలో 'చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంరక్షణ'లో పాఠశాలల పాత్ర అంశంపై సీసీఆర్టీ(సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్) సాంస్కృతిక వనరులు, శిక్షణ కేంద్రం న్యూఢిల్లీ వారు నిర్వహిస్తున్నారు. దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిభ గల ఉపాధ్యాయులను ఈ శిక్షణకు ఎంపిక చేశారు. హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పంజా రాజమల్లు ఎంపిక కావడంపై ఎస్సీ ఈఆర్టీ డైరెక్టర్ గాజుల రమేశ్, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, బేతి భాస్కర్, ఎంఈఓ దేశిరెడ్డి, వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు 'నిధి ఆప్‌కే నిఖత్'

పటాన్‌చెరు టౌన్: భవిష్య నిధి సమస్యల పరిష్కారానికి సంబంధించిన ఫిర్యాదుల్లో భాగంగా మంగళవారం నిధి ఆప్‌కే నిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు కేంద్రాల్లో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు శిబిరాలు నిర్వహించనున్నారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని ఏపీటీ పవర్ ఇంజినీరింగ్ లిమిటెడ్, సంగారెడ్డిలోని పద్మావతి సూపర్ స్పెషలిటీ హాస్పిటల్, మెదక్‌లో బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భవిష్య నిధికి సంబంధించి సమస్యలు ఉన్నవారు పరిష్కరించుకోవాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన బియ్యంతో పోలీసులు

మర్కుక్(గజ్వేల్): ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ దామోదర్‌రెడ్డి సోమవారం సిబ్బందితో కలిసి మండలంలోని నర్సన్నపేట గ్రామ శివారులో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మాలోత్ నవీన్ తన వాహనంలో ఎలాంటి అనుమతులు లేకుండా 38 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనంతోపాటు బియ్యం బస్తాలను సీజ్ చేసి, అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీఐ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని, 100కు సమాచారం ఇవ్వాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

జహీరాబాద్ టౌన్: పేకాటాడుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ కాశీనాథ్ కథనం మేరకు.. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో న్యాల్‌కల్‌కు చెందిన పడకంటి వెంకట్ ఇంటిపైన పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు సోమవారం దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేశాం. వారి వద్ద నుంచి రూ.60,340 వేల నగదు, ఏడు సెల్‌ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.


ఉపాధ్యాయులు లేక తరగతి గదిలో ఖాళీగా కూర్చున్న విద్యార్థులు

బోధించేవారేరీ?

విద్యా రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని సర్కారు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితులు కానరావడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఉపాధ్యాయుల కొరత వేధిస్తుంది. దీంతో బడుల్లో విద్యాబోధన అంతంత మాత్రంగానే కొనసాగుతుంది. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చి దిద్దుతామని చెబుతున్న ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీలపై దృష్టి సారించడం లేదు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారు. చాలీచాలని వసతుల మధ్య చదువుకుంటున్న విద్యార్థుల పాలిట ఉపాధ్యాయుల కొరత శాపంగా మారింది.

– కంగ్టి(నారాయణఖేడ్)

కంగ్టి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 532 మంది విద్యార్థులతో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో 10 తరగతులు, తడ్కల్ జెడ్పీహెచ్ఎస్‌లో 511 మంది విద్యార్థులతో 10 తరగతులు కొనసాగుతున్నాయి. కాగా తడ్కల్‌లో ముగ్గురు మ్యాథ్స్, ఇద్దరు ఫిజికల్ సైన్స్, ఇద్దరు లాంగ్వేజెస్ టీచర్లు ఉన్నారు. మిగితా సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరు. కంగ్టి జెడ్పీహెచ్ఎస్‌లో ముగ్గురు ఇంగ్లిష్, ఇద్దరు బయోసైన్స్, సోషల్, ఫిజిక్స్, పీడీ పోస్టులు ఒక్కోటి చొప్పున ఖాళీలు ఉన్నాయి. దీంతో నిత్యం తెలుగు మీడియంతో పాటు ఇంగ్లిష్ సక్సెస్ తరగతులు ఎలా నిర్వహిస్తున్నారనేది ఆందోళన కలిగిస్తుంది. అలాగే, సిర్గాపూర్, నాగల్‌గిద్దా, మనూరు మండల్లాలోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు సమాచారం.

జూన్‌లో బడిబాట ర్యాలీలు..

ప్రైవేటు పాఠశాలల కంటే దీటుగా.. కార్పొరేటు స్కూళ్ల కంటే మేటిగాప్రభుత్వ పాఠశాలలు కొనసాగిస్తామని ప్రగల్భాలు పలికే విద్యాశాఖాధికారులకు మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థుల గోసలు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కంగ్టి, సిర్గాపూర్, మనూరు, నాగల్‌గిద్దా మండలాల్లోని పాఠశాలలే నిదర్శనం. జూన్‌లో బడిబాట ర్యాలీలు నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సర్కారు బడుల్లోనే పిల్లలను చేర్పించాలని ప్రచారం చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో వద్దు.. సర్కారు బడులే ముద్దు అని నినాదాలు చేశారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

- బడి బాటతో ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల అడ్మిషన్లు
- ఇటీవలె టీచర్ల బదిలీలు
- ప్రమోషన్‌లో వచ్చిన ఉపాధ్యాయులు సైతం రివర్షన్
- 500కు పైగా విద్యార్థులున్నా.. ఐదారుగురితోనే నెట్టుకొస్తున్న వైనం
- ఊసేలేని వీవీల నియామకం

బదిలీలతో మరిన్ని ఇబ్బందులు

ఇటీవలె 11 మంది టీచర్లను బదిలీ కాగా రిలీవ్ చేశారు. గతంలో ప్రమోషన్‌లో వచ్చిన వారు జాయిన్ కాకపోగా రివర్షన్‌లో తిరిగి వెళ్లారు. అయినా బదిలీ అయిన వారి స్థానంలో కొత్త వారు వచ్చే వరకు రిలీవ్ చేయకుండా ఉంటే విద్యార్థులకు న్యాయం జరిగేదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తడ్కల్‌లో 28 పోస్టులు మంజూరు కాగా ఏడుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో ఇప్పటికే కొన్ని జిల్లాల్లో అధికారుల ఆదేశాలతో వీవీల నియామకం చేశారు. కానీ సంగారెడ్డి జిల్లాలో అలాంటి నియామకాలు చేపట్టలేదు. నూతనంగా ఉపాధ్యాయులు వచ్చేంత వరకు వీవీల నియామకం చేసి సమస్య పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వీవీలను నియమించాలి



విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడంతో తాత్కాలికంగా వీవీల నియామకం కోసం పై అధికారులకు విన్నవించాం. ఉపాధ్యాయులు సీఎల్‌పై వెళ్తే తరగతుల నిర్వహణ కష్టంగా మారింది. పీడీతోపాటు ఉపాధ్యాయులు అవసరం. ప్రమోషన్‌పై వచ్చిన ఉపాధ్యాయులు జాయిన్ కాకుండా రివర్షన్‌పై పోవడంతో సమస్య జఠిలంగా మారింది.

– రహీమొద్దీన్, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, తడ్కల్

అన్ని సబ్జెక్టులు కవర్ చేస్తున్నాం



ఉపాధ్యాయుల కొరత ఉన్నా విద్యార్థులకు బోధనలో ఇబ్బందులు కలగకుండా అన్ని క్లాసులు జరిగేట్లు చర్యలు తీసుకుంటున్నాం. వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో కొందరికి, డిప్యూటేషన్‌పై ఒకరిద్దరిని పంపి తరగతులు కొనసాగిస్తున్నాం. విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకుండా పాఠాలు సజావుగా జరిగేట్లు చర్యలు తీసుకొంటాం. ఆందోళన చెందొద్దు.

– శంకర్, మండల విద్యాధికారి, కంగ్టి

పరిమళించిన మానవత్వం

- అనారోగ్యంతో మృతి చెందిన అంగన్‌వాడీ ఆయా
- చందాలు వేసి అంత్యక్రియలు జరిపించిన నేతలు, స్థానికులు


కమలమ్మ (ఫైల్)

రేగోడ్(మెదక్): అనారోగ్యంతో మృతిచెందిన అంగన్‌వాడీ ఆయాకు స్థానిక నేతలు, గ్రామస్తులు అండగా నిలిచారు. సొంత ఖర్చులతో అంత్యక్రియలను నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. స్థానికుల కథనం మేరకు.. మెదక్ జిల్లా రేగోడ్ మండల కేంద్రానికి చెందిన రావులకోరి కమలమ్మ (67) సుమారు 30 ఏళ్లుగా స్థానిక అంగన్‌వాడీ నాలుగో కేంద్రంలో ఆయాగా పని చేస్తున్నారు. రూ.7,800 వేతనం తీసుకుంటుండగా నిత్యావసరాలకు ఏ మాత్రం సరిపోలేదు. ఇల్లు గడవడమే కష్టంగా ఉన్న కమలమ్మ ఇటీవల అనారోగ్యంతో మంచం పట్టింది. వైద్యులకు చూపించినా నయం కాలేదు. చివరకు ఆదివారం మృతి చెందింది. అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, స్థానికులు మేమున్నామంటూ అండగా నిలిచారు. చందాలు వేసి రూ.31,700ను కమలమ్మ కుమారుడు నర్సింహులుకు అందజేసి అంత్యక్రియలను పూర్తి చేశారు. ప్రభుత్వం స్పందించి కమలమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఎం డీ.సర్దార్ తదితరులు కోరుతున్నారు. ఇందులో మాజీ సర్పంచ్‌లు సుంకె రమేశ్, బీ.నర్సింహులు, కో ఆప్షన్ మాజీ సభ్యుడు మొహిజొద్దీన్, గొల్ల చంద్రశేఖర్, సుభాష్, ఆటో డ్రైవర్ రామాగౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కమలమ్మ రిటైర్‌మెంట్ కోసం ప్రభుత్వానికి పదిహేను రోజుల కిందటే ప్రతిపాదనలు పంపించామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కృష్ణవేణి సాక్షితో తెలిపారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


నర్సింహులుకు ఆర్థికసాయం నగదు అందజేస్తున్న నేతలు, స్థానికులు

రైతుపై ఎలుగుబంటి దాడి

హవేళిఘణాపూర్(మెదక్): రైతుపై ఎలుగుబంటి దాడి చేయగా తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని వాడి పంచాయతీ పరిధిలోని దూప్‌సింగ్ తండాకు చెందిన రవి సోమవారం అటవీ పరిసరాల్లో ఉన్న తన పొలం వద్దకు నీరు పార పెట్టేందుకు వెళ్లాడు. ఎలుగుబంటి అటవీ ప్రాంతంలో నుంచి వచ్చి దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన పొరుగు రైతులు వెంటనే అతడిని మెదక్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

ఉపాధ్యాయుడు బ్రెయిన్‌డెడ్


శ్రీనివాస్(ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): బ్రెయిన్‌డెడ్‌తో ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ ఘటన చిలప్‌చెడ్ మండలం బద్యాతండాలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బద్యా తండా పంచాయతీ బంజారానగర్ తండాకు చెందిన జరప్ల శ్రీనివాస్(38), మండల పరిధిలోని గౌతాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహించేవాడు. కొద్ది రోజుల కిందట పక్షవాతం రావడంతో చికిత్స చేయించుకున్నాడు. ఇటీవల మళ్లీ రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అవడంతో ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మృతిపై పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మండల ఉపాధ్యాయులు, ఇన్‌చార్జి ఎంఈఓ బుచ్చానాయక్ సంతాపం తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


తిరుపతి(ఫైల్)

కోహెడరూరూరల్(హుస్నాబాద్): పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వింజపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అభిలాష్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన నంగునూరు తిరుపతి(35) జీవనోపాధి కోసం భార్య భవానీ, కుమారుడు శివ ధనుష్, కూతురు శ్రీనిత్యతో కలిసి కరీంనగర్ లో ఉంటున్నాడు. ఆదివారం గ్రామానికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో భార్య పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. సోమవారం ఉదయం తన పొలం వద్ద పురుగుల మందు తాగి పడి ఉన్నట్టు గ్రామస్తులు గుర్తించారు. ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడనే దానిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గర్భిణి కడుపులో కణతి తొలగింపు

అరుదైన శస్త్ర చికిత్సతో తల్లీబిడ్డలు క్షేమం


మహిళతో వైద్యుల బృందం

మెదక్‌జోన్ : పురిటి నొప్పులతో మాతా శిశు సంరక్షణ కేంద్రం ఆస్పత్రిలో చేరిన ఓ మహిళకు వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ శివ దయాల్ కథనం మేరకు.. చిన్నశంకరంపేట మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన కర్రోళ్ల జ్యోతిని ప్రసవం కోసం ఆదివారం కుటుంబీకులు మెదక్ ఎంసీహెచ్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. డాక్టర్ శివ దయాల్ వైద్య బృందం, వైద్యులు శిల్ప, సునీల్, ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో రాత్రి శస్త్ర చికిత్సను ప్రారంభించారు. ఆ సమయంలో మహిళ కడుపులో 2 కిలోల కణితి ఉన్నట్లు గుర్తించారు. దాదాపు మూడు గంటలపాటు శ్రమించి కిలోన్నర కణితి తొలగించారు. అనంతరం బిడ్డను క్షేమంగా బయటకు తీశారు. ప్రస్తుతానికి ఇద్దరూ క్షేమంగా ఉన్నారని శివ తెలిపారు. ఈ సందర్భంగా వైద్య బృందానికి మహిళా కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 62 కేసులు నమోదు


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

కమిషనరేట్ పరిధిలో స్పెషల్ డ్రైవ్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆకస్మిక వాహనాల తనిఖీ చేపట్టినట్లు సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ సిబ్బందితో కలిసి శనివారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహనాల తనిఖీ నిర్వహించగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ 62 మంది పట్టుబడ్డారన్నారు. వీరిపై కేసులు నమోదు చేశామన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు, ఇతర ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 350 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనుమానస్పదంగా ఉన్న 225 మంది వ్యక్తులను ఫింగర్ ప్రింట్ డివైజ్ ద్వారా తనిఖీ చేశామన్నారు. అదే విధంగా సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ పట్టణాలలోని లాడ్జీలను తనిఖీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు లక్ష్మీబాబు, ఉపేందర్, విద్యాసాగర్, శ్రీను, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలపై నిషేధం

- అమ్మితే రూ.2 లక్షల జరిమానా
- అప్పాజీపల్లి గ్రామస్తుల తీర్మానం

అల్లాదుర్గం(మెదక్): అక్రమ మద్యం అమ్మకాలపై నిషేధం విధిస్తూ మండల పరిధిలోని అప్పాజీపల్లి గ్రామంలో గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. గతేడాది బెల్టు షాపు ద్వారా మద్యం విక్రయించేందుకు వేలం వేశారు. మద్యం అమ్మకాలతో గ్రామంలో గొడవలు జరగడం, కుటుంబాలు నాశనమవుతున్నాయని గ్రామస్తులు ఏకమై సోమవారం సమావేశం ఏర్పాటు చేసుకొని తీర్మానం చేసుకున్నారు. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామ అభివృద్ధికి నిధులు వస్తాయనే ఉద్దేశ్యంతో అప్పాజీపల్లి గ్రామంలో గతేడాది మద్యం విక్రయాలకు వేలం వేశారు. రూ.80 వేలకు ఓ వ్యక్తి తీసుకున్నారు. అక్రమ మద్యం విక్రయాలు జోరుగా సాగడంతో శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లుతుంది. మద్యం అమ్మకాలతో డబ్బు సంపాదించుకుంటున్నారని, కుటుంబాల్లో గొడవలు జరుగుతుండటం గమనించాం. మద్యం నిషేధిస్తేనే గ్రామం బాగుపడుతుందని అనుకున్నాం. సోమవారం గ్రామ పంచాయతీ వద్ద యువకులు, గ్రామ పెద్దలు, నాయకులు చర్చించుకొని మద్యం అమ్మకాలను నిషేధిస్తున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానించారు. తీర్మానానికి వ్యతిరేకంగా మద్యం అమ్మితే రూ.రెండు లక్షలు జరిమానా విధిస్తామని, అమ్ముతుండగా పట్టించిన, సమాచారం ఇచ్చిన రూ.50 వేలు నజరానా ఇస్తామని పేర్కొన్నారు.

భుజిరంపేటలో జపాన్ విద్యార్థులు


భుజిరంపేట గ్రామస్తులతో జపాన్ విద్యార్థులు

సంస్కృతీ, సంప్రదాయాలు, ప్రజల జీవన విధానం పరిశీలన

కొడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లోని సంస్కృతీ, సంప్రదాయాలు, ప్రజల జీవన విధానం తెలుసుకునేందుకు జపాన్ విద్యార్థులు సోమవారం కొడిపల్లిలో పర్యటించారు. భుజిరంపేట గ్రామంలో హైదరాబాద్(కంది) ఐఐటీ ఆధ్వర్యంలో జపాన్ సుజుకి సంస్థకు చెందిన 15 మంది విద్యార్థులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు, యువకులు డీజే సౌండ్, నత్యలతో విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ప్రజల జీవన విధానం, ఆహారం, పండుగలు, ఆచారాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధి, విద్యార్థుల అభివృద్ధికి ఏం కావాలన్న విషయాలు అడుగగా ఐఐటీ టీం లీడర్ రమాదేవి గ్రామస్తులు చెప్పిన విషయాలను ఇంగ్లిషులో అనువాదం చేసి వివరించారు. కార్యక్రమంలో జపాన్ విద్యార్థి బృందం టీమ్ లీడర్ రాఖీ, నాయకులు నాయికోటి లింగం డ్వాక్రా మహిళలు లలిత, సబిత, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వీరేశం, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లీకూతురు అదృశ్యం


తల్లి సరస్వతి, భార్గవి

టేక్మాల్(మెదక్): తల్లీకూతురు అదృశ్యమైన ఘటన టేక్మాల్ మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఏఎస్‌ఐ దయానంద్ కథనం మేరకు.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన గొల్ల సరస్వతిని అదే గ్రామానికి చెందిన మల్లేశంకు ఇచ్చి వివాహం జరిపారు. వీరికి కూతురు భార్గవి ఉంది. మల్లేశం రెండేళ్ల కిందట మృతి చెందగా, అప్పటి నుంచి సరస్వతి తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. 23వ తేదీన నర్సాపూర్‌లోని రుస్తుంపేట పీఠాధిపతి స్వామి వద్దకు వెళ్లి వస్తానని కూతురిని తీసుకొని వెళ్లి తిరిగి రాలేరు. వ్యవసాయ పనులు ముగించుకొని వచ్చిన తల్లి చుట్టుపక్కలతోపాటు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి కిష్టమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ దయానంద్ కేసు నమోదు చేసుకున్నారు.

ఇంటి నుంచి వెళ్లి యువతి..


స్వాతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని చండూర్ గ్రామంలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్‌ఐ యాదగిరి కథనం మేరకు.. గ్రామానికి చెందిన నీరుడి భిక్షపతి, ప్రమీల దంపతుల కూతురు స్వాతి 10వ తరగతి వరకు చదువుకొని ఇంటి వద్దే ఉంటుంది. తండ్రి గతంలోనే చనిపోయింది. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించిన స్వాతి సోమవారం ఉదయం చూసేసరికి ఇంట్లో లేదు. సోదరుడు సతీష్ చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. స్వాతి చామన చాయ రంగులో ఉంటుందని, పింక్ రంగు టాప్, తెల్లని ప్యాంటు ధరించి ఉందని, తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

80 ఏళ్ల వృద్ధురాలు..


ముత్యాలమ్మ

తూప్రాన్: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన మండలంలోని ఇస్లాంపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. గ్రామానికి చెందిన పిట్టల ముత్యాలమ్మ(80) 21వ తేదీన రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగిరా లేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

నర్సాపూర్ రూరల్: తాళం వేసిన ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ లింగం కథనం మేరకు.. మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన శ్రీనాథ్ గౌడ్, గొల్ల ముత్యాలు ఇళ్లకు తాళాలు వేసి బంధువుల పెళ్లికి వెళ్లారు. ఇదే అదునుగా చూసిన గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఇళ్ల తాళాలు ధ్వంసం చేసి శ్రీనాథ్ గౌడ్ ఇంట్లో రూ.10 వేల నగదు, గొల్ల ముత్యాలు ఇంట్లో రూ.15 వేల నగదుతోపాటు 20 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ఏడుగురికి తీవ్ర గాయాలు

గుర్తు తెలియని మహిళ దుర్మరణం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు దాటుతున్న మహిళను ట్రాలీ లారీ ఢీకొట్టడంతో మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సమీపంలో ఓ గుర్తు తెలియని 45 ఏళ్ల మహిళ సోమవారం తెల్లవారు జామున జాతీయ రహదారిని దాటుతుంది. అదే సమయంలో అతివేగం వచ్చిన మహారాష్ట్రకు చెందిన ట్రాలీ లారీ ఢీకొట్టింది. దీంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం ట్రాలీ లారీ బైక్‌ను ఢీకొట్టడంతో వాహనదారుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బతుకుదెరువు కోసం వచ్చి యువకుడు..

మనోహరాబాద్(తూప్రాన్): బతుకుదెరువు కోసం రాష్ట్రాలు దాటి వచ్చిన యువకుడు పనిలో చేరకుండానే మృతి చెందాడు. సోమవారం ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంకి చెందిన కీర్ సాగర్ అన్నాదమ్ముళ్లు సర్జన్‌కుమార్, లాల్‌సాయితో కలిసి మండలంలో శివారులోని సెఫ్ ఎక్స్‌ప్రెస్ పరిశ్రమలో పని చేయడానికి 25వ తేదీన వచ్చాడు. పరిశ్రమలో పని చేయడానికి వెళ్తుండగా కీర్ సాగర్ కళ్లు తిరుగుతున్నాయని రోడ్డు పక్కన కూర్చున్నాడు. వెంటనే తోటివారు మేడ్చల్‌లోని ప్రవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి సోదరుడు నరేశ్ కుమార్ చక్రవర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


మనోహరాబాద్(తూప్రాన్): ప్రమాద స్థలంలో గాయాలతో యువకులు

లారీని ఢీకొట్టిన యువకులు..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని రామాయపల్లికి చెందిన యువకులు జశ్వంత్, అరవింద్ బైక్‌పై మేడ్చల్ వైపు వెళ్తున్నారు. కాళ్లకల్ శివారులోకి రాగానే ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. వీరిలో జశ్వంత్ పరిస్థితి విషమంగా ఉందన్నారు.

రెండు కార్లు ఢీ..

సిద్దిపేటఅర్బన్: ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల రాజీవ్ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం మేరకు.. పెద్దపల్లి జిల్లా రామగుండంకు చెందిన సహనుల్లా తాత అసదుల్లాకు అనారోగ్యంగా ఉండడంతో తండ్రి సాదతుల్లాతో కలిసి హైదరాబాద్‌కు కారులో తీసుకెళ్లి చికిత్స చేయించుకొని తిరిగి వస్తున్నారు. పొన్నాల ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే రాంగ్ రూట్‌లో వస్తున్న మరో కారు డ్రైవర్ కాడే సూర్యనారాయణ అతివేగంగా వీరిని కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రెండు కార్లు ధ్వంసం కాగా, అసదుల్లా, సాదతుల్లా, సూర్యనారాయణకు గాయాలు అయ్యాయి. సహనుల్లా ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


సిద్దిపేటఅర్బన్ : ప్రమాదంలో ధ్వంసమైన కార్లు

రోడ్డు దాటుతుండగా గురుకుల విద్యార్థికి..

సిద్దిపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో గురుకుల విద్యార్థికి తీవ్ర గాయాలైన ఘటన నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి కథనం మేరకు.. నారాయణరావుపేటకు చెందిన జీ.మనోజ్ కుమార్ ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. బంధువు చనిపోవడంతో 15 రోజుల కిందట ఇంటికి వెళ్లాడు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సోమవారం వచ్చిన మనోజ్ అనుమతి లేకుండానే మధ్యాహ్నం గురుకుల పాఠశాల గోడ దూకి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు కారు ఢీకొట్టింది. స్థానికులు చికిత్స నిమిత్తం సిద్దిపేట ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.